

# చంద్రునికో నూలుపోగు

సూర్యప్రసాదరావు

**సెప్టెంబర్ ఐదవ తేదీ.
తమ విద్యాదాతకు విద్యార్థులు ఓ నూలుపోగు సమర్పించుకునే రోజు. తల్లిదండ్రులంత ప్రాముఖ్యమున్నవాడని అధ్యాపకుడిని గుర్తించేరోజు. అధ్యాపకునికి సంఘంలో సమున్నత స్థానాన్ని సంపాదించిపెట్టిన భారతీయ తత్త్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మించిన రోజు!**

ఆ రోజు......ఉపాధ్యాయ దినోత్సవం.

పరాత్పరరావు వెలిగిపోతున్నాడు. కన్నులపండుగగా అలంకరించిన కాలేజీస్టేజీ మీద. ఆయన చాలామందికి ఆప్తుడు. మేనేజ్‌మెంట్‌కు తలలోని నాల్కవంటివాడు. అడ్మినిస్ట్రేషన్‌కు ఊపిరిలాంటివాడు. పురప్రముఖులందరికీ పరిచయమైనవాడు. ఖరీదైన విద్యార్థులందరికీ ప్రత్యక్షంగా పరీక్షలకై వెలసిన దైవం. కళాశాల మనుగడకే ఓ మూలస్తంభం!

వేదపండితుల ఆశీస్సులతో మొదలైన సన్మానసభ ...గురుదేవుని సన్మానసభ... ఆచార్యుని ఆరాధనాసభ .... కళాశాల కరస్పాండెంట్ శుభాకాంక్షలతో, అడ్మినిస్ట్రేటర్ల అనర్గళోపన్యాసాలతో వానకురిసి వెలసినట్లయింది.

పరాత్పరరావు నుదుట ఓ పురప్రముఖుడు తిలకం దిద్దితే ...మరొకరు మంచిగంధం పూశారు. మరొకరు పూలవాన కురిపించారు. కరస్పాండెంట్ గారు ఖరీదైన శాలువా కప్పారు. నాలుగు దిశల నుండీ ఫ్లాష్‌లు... క్లిక్‌లు....వీడియో కవరేజీలు.

పరాత్పరరావు నీతి, నిజాయితీ, సిన్సియారిటీ, పరోపకారగుణాలన్నీ పదేపదే ప్రస్తావించి, మిగిలిన సమయం పరాత్పరరావుగారికి కేటాయించారు. ఆయన "నాకు జరిగిన సన్మానానికి అర్హుడిని. యోగ్యుడిని. సన్మానం చేయించుకునే అర్హత నాకుంది. కాలేజీలో రెగ్యులర్‌గా క్లాసులు తీసుకోవడం, క్షణం లేటు కాకుండా క్లాసులకు వెళ్లడం...అర్థంకాని పాఠం ఎన్నిసార్లైనా చెప్పడం... విద్యార్థుల బాగోగుల గురించి రోజూ వాకబు చెయ్యడం....ఈ లక్షణాలే ఈ రోజు నాకు సన్మానం చేయిస్తున్నాయి. "

ఆయన స్వోత్కర్షకు సభలో అనేకమంది విస్తుబోయారు. కొందరు ఓహో అన్నారు. కొందరు ఆహా అన్నారు. కొందరు 'ఎంత నిజాయితీగా ...పాఠంలా...సన్మానానికి కృతజ్ఞతలు చెబుతున్నారు' అన్నారు.

పరాత్పరరావు పరమసత్యాలను ఉటంకించడం మొదలెట్టాడు.

"ఎ టీచర్ యీజ్ ఆన్ ఎవర్‌గ్రీన్ స్టూడెంట్ " అధ్యాపకుడు ఓ నిరంతర విద్యార్థి. చదువు పూర్తయేంత వరకే విద్యార్థి చదువుతాడు. కానీ అధ్యాపకుడు జీవితమంతా చదువుతూనే వుంటాడు. నేను నిరంతరవిద్యార్థిని కాబట్టి నాకు ఈ రోజు సన్మానం. మా అమ్మఅంటూండేది... అన్నప్రాసన నాడు నేను పుస్తకాన్నే పట్టుకున్నానట! అందుకనే విద్యపట్ల నా దాహం తీరనిది. నా కోర్కె అంతం లేనిది!......"

పరాత్పరరావు స్వోత్కర్ష యింకా సాగేదే! గానీ.... ఇంతలో ఓ విద్యార్థి ఓ ఫోటోతో, శాలువతో, దండతో స్టేజీ మీదకు రావడం, అధ్యక్షులవారితో మాట్లాడటం, మరో మైక్ అందుకోవడం ఒక్కసారి జరిగిపోయాయి.

"మాస్టారు నన్ను క్షమించాలి. సభ నన్ను క్షమించాలి. వారి కృతజ్ఞతలు పూర్తిగా వినకుండా చేసినందుకు...వారి కృతజ్ఞతలు పూర్తయితే సభ పరిసమాప్తమవుతుంది. కానీ అంతకంటే ముఖ్యమైనదీ ...మాస్టారువంటి ఆదర్శ అధ్యాపకులు కోరుకునేదీ...తన విద్యార్థుల చేత సన్మానం. అందుకే విద్యార్థిబృందం తరపున... ముఖ్యంగా పేదవిద్యార్థి బృందం తరపున సన్మాన

## పదేళ్లు

"పదేళ్లక్రితం చెరువులో పడ్డ నా వాచీ ఇప్పటికీ చెక్కుచెదరక బాగా పనిచేస్తోంది" అన్నాడు సుమన్.

"అలాగా...ఒకసారి నీటిలో పడ్డ నేను పదేళ్ల తర్వాత బయటికి వచ్చాను... బతికే ఉన్నాను" అన్నాడు రమణ్.

"పదేళ్లు ఏం చేస్తున్నావ్?" ఆశ్చర్యంగా అడిగాడు సుమన్.

"నీ వాచీకి కీ ఇస్తున్నాను." చెప్పాడు రమణ్.

**జి. జోగారావ్,** హౌరా

---

పత్రాన్ని సభకు సమర్పించడానికి అనుమతి ఇవ్వవలసిందిగా ప్రార్థిస్తున్నాను. ..."

పరాత్పరరావు ఛాతీ ఉప్పొంగింది. మనసు నిండా ఆనందం కమ్ముకోగా ప్రసన్నవదనంతో పక్కకు తప్పుకున్నాడు. ఆ విద్యార్థి పరాత్పరరావుకు పాదాభివందనం చేసి, దండవేసి, శాలువా కప్పి సన్మానపత్రంతో ముందుకుమైక్ ముందుకు నడిచాడు. సభ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తోంది. అందరికీ నమస్కారాలు చెప్పి మొదలు పెట్టాడా కుర్రాడు. పరాత్పరరావు తన సీటులో వెళ్లి కూచున్నాడు.

'పరాత్పరరావుగారు అధ్యాపకవృత్తిలో కాకలు తీరిన యోధులు. చదువు'కొనే' వారికి కల్పతరువు. ఖరీదుగా విద్యాదానం చేయడంలో అందెవేసిన చేయి.

ఆయన కనిపించని కాలం: అధ్యాపకుల సమ్మె ప్రారంభమైన రోజున అదృశ్యమై తిరిగి విరమించిన రోజు వరకు....

కనిపించకపోవడానికి కారణం: రోజుకు పద్దెనిమిది గంటల పాటు ఖరీదైన విద్యాదానం చెయ్యడానికి.... చదువు 'కొనుక్కునే' వారికి సంపూర్ణంగా న్యాయం చెయ్యడానికి...

అత్యంత ప్రియమైనవి : "టైమ్ ఈజ్ మనీ ఆలస్యం అమృతం విషం, దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకో, ధనమూల మిదం జగత్ " అన్న లోకోక్తులు.

ఆచరించేవి: 'కాసులేనికి కోసెడు దూరంలో వుంచు, దుడ్డులేని వాడిని చివరకు కూడా పడవ ఎక్కనివ్వవద్దు.. దయకన్నా ధనమేమిన్న' అనీ వారు నిత్యం స్మరించే మూడు మహామంత్రాలు.

కార్యదీక్షాపరత్వం: సమ్మెకు సార్థకత చేకూర్చే సదుద్దేశ్యంతో చదువు గురించి గానీ, సిలబస్ గురించి గానీ కాలేజీ విద్యార్థులు ఎవరడిగినా సమాధానం చెప్పని, నూటికి నూరుపాళ్లు విజయవంతంగా ఆచరించిన అకుంఠిత కార్య దీక్ష.

పేద విద్యార్థులకు ఇచ్చే ప్రోత్సాహం: కష్టపడి చదువుకుని పాసవుదామనుకున్న ఓ పేదవిద్యార్థి పరాత్పరరావుగారి కరుణా కటాక్షాలకు నోచుకోక వారి వద్దకు ట్యూషన్‌కు వెళ్లే డబ్బులేక, సమ్మె ఫలితంగా తప్పడంతో, ఓ విద్యాసంవత్సరాన్ని కోల్పోయాడు. సంవత్సరం వరకు రావలసిన ఉపకారవేతనం ఆగిపోయి కడుపునింపుకోవడానికి అతను వ్యవసాయకూలీగా అవతారం దాల్చడానికి వారు అపూర్వఅవకాశం ఇచ్చారు.

ప్రస్తుతం: ఆడంబరాలకు, అధికార వ్యామోహాలకు, అంధలాలు మోసే మనస్తత్వాలకు ఘనసన్మానం జరుగుతున్న యీ సమయంలో మా పేదవిద్యార్థుల తరపున చంద్రునికో నూలుపోగు! ఆదిత్యునివంటి ఆచార్యునికో ఓ చిరుదీపం! కుబేరునికి యీ కుచేలుడు సమర్పించుకునే చిరుకానుక!!

ఆ విద్యార్థి అనర్గళంగా తన అధ్యాపకవృత్తి పుటలను విప్పి మరీ చదువుతుంటే పరాత్పరరావు నిశ్చేష్టుడయ్యాడు. ఆయన ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు. తన అహంకారం, తన అహంభావం, ధనదాహాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు సభికులకు వివరిస్తుంటే అతన్ని నఖశిఖ పర్యంతం పరిశీలిస్తున్నాడు. అతను ఎప్పుడో తన ఇంటికి వచ్చినట్లు గుర్తు!

సందేహంలేదు. అధ్యాపకుల సమ్మె ఉధృతంగా సాగుతున్న రోజుల్లో తన ట్యూషన్ బాచీలు నిరాటంకంగా చదువుకుంటున్న రోజుల్లో....

"మీరు సమ్మె చేస్తున్నారు కదా మాస్టారూ! అందుకని సిలబస్‌లు పూర్తికాలేదు. కొన్ని చాప్టర్లు చాలా కష్టంగా వున్నాయి. దయచేసి ఎక్స్‌ప్లెయిన్ చేస్తారేమోనని" అతను నసిగితే....

"మీ సిలబస్‌లు పూర్తి చెయ్యడానికటయ్యా... మేం సమ్మె చేసేది.

మా డిమాండ్స్ నెరవేరాలి. ఎప్పటిలా సిలబస్‌లు పూర్తయితే మా సమ్మె ప్రభావం వుంటుందా! అందుకనే సమ్మె విరమించిన తరువాతనే క్లాసులు."

"అప్పుడు పరీక్షలు ప్రారంభమౌతాయట సర్! పరీక్షల్లో తప్పుతానని భయంగా వుంది."

"మళ్లీ సెప్టెంబరు, మార్చి ఉన్నాయిగా"

"తప్పితే సంవత్సరం నష్టపోతాను మాస్టారూ! వచ్చే స్కాలర్‌షిప్ రాదు" ఆ విద్యార్థి గొంతులో ఆవేదనను తను గుర్తించలేదు.

"స్కాలర్‌షిప్ రాకపోతే ఏమౌతుంది."

"ఓపూట తినేవాళ్లం పస్తులుండాల్సివస్తుంది."

"అయితే ట్యూషన్ చదువుకో!"

"ఎంతకాలం తేలికగా చెప్పారు మాస్టారూ! అతను దీర్ఘంగా నిట్టూర్చాడు. ఓ పూట పస్తులుండి నన్ను చదివించే మా వాళ్లను ట్యూషన్ చెప్పించమని ఎలా అడగమంటారు! కాలేజీ ఫీజులు కట్టడానికే అష్టకష్టాలుపడే వాళ్లను ఎలా ఇబ్బందిపెట్టమంటారు! అందుకే సమ్మె తేలేంతవరకూ మీ బ్యాచ్‌ల్లో ఒకదానిలో కూర్చుంటాను."

"వీలుపడదయ్యా! వాళ్లకే చోటు చాలడంలేదు. అయినా వాళ్లకు ఆ చాప్టర్లు ఎప్పుడో అయిపోయాయి. ఇక నువ్వు వెళ్లవచ్చు." నిష్కర్షగా, నిర్దాక్షిణ్యంగా అతన్ని పంపించేశాడు.

"అందుకే మా మాస్టారికి మరోసారి మనసారా విన్నవించుకుంటున్నాం" ఆ విద్యార్థి అభ్యర్థనతో పరాత్పరరావు ఇహంలోకి వచ్చేశాడు.

"ఉదయాన్నే ఇంటింటికి పేపర్‌వేసే దినచర్య... విద్యాలయాన్నే ఓ దేవాలయంగా.... గ్రంథాలయాన్నే ఓ పూజాగృహంలా... వీధిదీపాలే చదువుకోవడానికి వెలుగులుగా... జీవనం గడపగానికి, ఫీజులుకట్టుకోవడానికి చిన్న పిల్లలకు ట్యూషన్ చెబుతూ.... అలా సంపాదించిన డబ్బులోంచే ఆదా చేసి ఈ రోజు మాస్టారికి ఈ 'నూలుపోగు' సమర్పించుకున్నాం. మా పేదవిద్యార్థుల ఘర్మజలానికి, ఖరీదుగట్టి మరీ ఇది సమర్పించుకున్నాం." స్టేజీమీద పెద్దల హృదయాలు బరువెక్కాయి. సభికుల మనస్సులు కలత చెందాయి. ఆ విద్యార్థి ఎప్పుడో సభలో కలిసిపోయాడు. పరాత్పరరావు మెల్లగా తేరుకున్నాడు. నిశ్శబ్దం సెకన్లుగా మారుతోంది. స్టేజీమీద వ్యక్తుల్ని ఆయన పరిశీలనగా చూస్తున్నాడు. అందాకా తన్ను పొగిడిన అధ్యక్షులవారు, కరస్పాండెంట్, పురప్రముఖులు, వక్తలు, ఆరాధనగా చూసిన చూపులే తనను అవహేళన చేస్తున్నట్లున్నాయి. తన స్వార్థచింతనను తూర్పార పట్టుతున్నట్టున్నాయి. నష్టపోయిన విద్యార్థులంతా శపిస్తున్నారు. పరాత్పరరావుకు భూమి ఒక్కసారి చీలిపోయి తనను దాచుకుంటే బాగుండుననిపించింది. ఒక్కసారిగా ఎవ్వరూ లేనిచోటికి పారిపోవాలనిపించింది. ఎలా! ఈ విషమ పరిస్థితినుండి, యీ సంకటపరిస్థితినుండి బయట పడడం ఎలా!

ఇంతలో అధ్యక్షులవారి మాటలు మైక్‌లో వినిపించాయి.

హృదయవిదారకరమైన ఆ విద్యార్థి ఆవేదనకు పరాత్పరరావుగారు సమాధానం చెప్పాలని సభంతా ఎదురుచూస్తోంది!

అందాకా సభలో వినిపించిన కలకల శబ్దాన్ని జయించిన నిశ్శబ్దం.

ఏదో నిశ్చయానికి వచ్చిన వాడిలా పరాత్పర రావు లేచాడు.

"సభాయై నమః" ఆయన మాటలు మైక్‌లో వినిపించనారంభించాయి.

'ఆ విద్యార్థి చెప్పింది అక్షరసత్యమే! నేను ధనపిపాసినే! డబ్బివ్వనిదే విద్యార్థిని నా గుమ్మం తొక్కనివ్వను. ఫీజు ఇస్తేనే అతనికి విద్యనమ్మడం ప్రారంభిస్తాను. ఎందుకు ఇలా తయారయ్యానో తెలుసా!

"స్కాలర్‌షిప్ లేకుండా అష్టకష్టాలూపడి, పి.జి. చేసి ఉద్యోగంలో చేరిన నేను, చాలీచాలని జీతంతో... విద్యార్థి జీవితమే కాదు... అధ్యాపక ప్రాథమిక జీవితమూ ఎంత దుర్భరంగా వుంటుందో అనుభవించాను. అప్పటికే వివాహమై ఓ పాపకు తండ్రినై, భార్యాబిడ్డల కనీస అవసరాలు తీర్చలేక ఎన్ని కడగండ్లు పడ్డానో మీకు తెలియదు. ఈ అత్తెసరు జీతంతో, జీవితంలో పాపకు పాలడబ్బా కొనడానికి డబ్బులేక, ఎవరూ తెలియని సర్వీసు కొత్తలో, ఎవరూ అప్పివ్వని ఈ దూర ప్రదేశపు ఉద్యోగంలో భార్య ఒంటిమీద నగల్ని ఒకొక్కటి హారతి కర్పూరం చేసేశాను.."

ఒక్కక్షణం గాప్ లభించిన సభకు పరాత్పరరావు కసాయితనం వెనుక ఎంతకరుణామయ గాథ వుందో అర్థమైంది.

"అప్పుడే వచ్చిన ఆలోచన 'కొనగలిగిన వారికెందుకు తను విద్యను అమ్మకూడదు!' అని. ఒక్కరితో ట్యూషన్ మొదలుపెట్టాను. పదిమంది చేరేసరికి సంవత్సరం పట్టింది. అంచెలంచెలుగా సంఖ్య పెరిగేసరికి మరో మూడేళ్లు పట్టింది.

" 'కోరి పిల్లనిస్తామంటే... కులం తక్కువన్నాడనే' సామెత నిజమనిపించింది. నెలరోజులపాటు ట్యూషన్‌కు వచ్చినవారు మరోనెల కనిపించేవారుకారు. ఫీజు అడిగితే పారిపోయేవారు కొందరు.... మొదటి ఇన్‌స్టాల్‌మెంట్‌తోనే మొత్తం సిలబస్ వినేవారు కొందరు. సగం సిలబస్ విని ఫీజు ఇవ్వకుండా పోయేవాళ్లు. అరవై శాతం ఫీజు వసూలు చేయగలిగితే గొప్పగా ఫీలయ్యేవాడిని. అంచెలంచెలుగా పెరిగిన సంఖ్యనుంచి అధిక శాతం ఫీజు వసూలు చేయడానికి పది సంవత్సరాలు పట్టింది. అందుకు నేను ఎంతో జీవితాన్ని కోల్పోయాను. ఉదయం ఐదింటికి దుకాణం ఓపెన్‌చేస్తే, తిరిగి మూసేది... రాత్రి ఎనిమిదింటికే! ఓ సినిమా లేదు. ఓ షికారు లేదు. ఓ టీ.వీ. ప్రోగ్రామ్ లేదు. ఓ పండగ లేదు. ఓ పబ్బం లేదు. ఓ ఆదివారం లేదు. టెస్ట్‌లు... వాల్యుయేషన్‌లతో కాలంగడిచిపోయింది. భార్యాపిల్లలతోసైతం కాలక్షేపం చేయలేని ఓ యాంత్రికజీవితానికి అలవాటుపడిపోయాను. ఎంతో అమూల్యమైన కాలం కోల్పోయాను. కానీ ... ఆ విద్యార్థి చెప్పినట్లు... ఆర్థికంగా సంతృప్తిగా వున్నాను."

గొంతు తడారిపోయిందని పరాత్పరరావు కొద్దిగా మంచినీరు తాగి మరీ అందుకున్నాడు.

"దానాలన్నింటిలోకి విద్యాదానం గొప్పది. ఎన్నిసార్లు దానం చేసినా తరిగిపోనిది విద్య మాత్రమే! అటువంటి విద్యాదానాన్ని ధనంతో ముడిపెట్టాను. విద్యాదానం పేరుతో ధనార్జన చేశాను. విద్యతో సమయాన్ని రూపాయలుగా మార్చాను. కొన్నాళ్లకు నేనంటే విద్యార్థులకు 'క్రేజు' పెరిగింది. ఆశ్చర్యం! ఆ రోజు నా పాఠం అక్కరలేదన్న వాళ్లే ఎగబడ్డారు. అడిగినంత యిచ్చేవారు. ఫీజు మొత్తం ఇచ్చి వచ్చి కూర్చునేవారు. ఫీజు ఇవ్వని వాళ్లను లోపలకు రానిచ్చేవాడిని కాను. దయాదాక్షిణ్యాలకు పూర్తిగా తిలోదికాలిచ్చేశాను. ఈ రోజు యీ విద్యార్థి 'చదువు చెప్పించలేని కన్నతండ్రి కన్నీళ్లు కనిపించేలా చేశాడు. ఆర్థికస్తోమత లేక దయనీయంగా దూరంగా నిలబడే పేదవిద్యార్థుల నిరాశా నిస్పృహలను కళ్లకుకట్టేలా చూపించాడు. ఈ సన్మానపత్రం వెనుక... యీ బరువైన పూల దండ వెనుక... యీ శాలువా వెనక వారి అమూల్యమైన చెమట కనిపిస్తోంది. .కన్నీటి చారికలు కనిపించాయి. అందుకనే ఇప్పుడే ఓ నిశ్చయానికి వచ్చేశాను.'

ఒక్కమారు గొంతు సర్దుకొని ధీరగంభీర స్వరంతో అన్నాడు.

"ఇక నా ఇల్లు సరస్వతీనిలయం కావాలి. విద్యాదానానికి ఆలయం కావాలి. ఎవరు పిలిచినా... ఎవరు అడిగినా నా ఇంట నిరాటంకంగా 'విద్యాభిక్ష' దొరుకుతుంది. దానికి వర్గ వర్ణ వివక్షలు లేవు. కులమత భేదాలు లేవు. 'విద్యాతురాణాం నసుఖం న నిద్రా' అని ఎందుకన్నారోగానీ.... విద్యాదానానికి నేను సుఖాన్ని, నిద్రనూ త్యజిస్తున్నాను. పత్రమో...పుష్పమో... ఫలమో... తోయమో ఇచ్చినా పుచ్చుకోను. ఇప్పటికి సంపాదించింది చాలు. ఇక నా జీవితం పేదవిద్యార్థుల పురోభివృద్ధికి అంకితం చేసుకుంటున్నాను. మనసా, వాచా, కర్మణా... ఇది సభాముఖంగా ఇందరు ఆశీనులైన చల్లనివేళ ప్రతిజ్ఞ చేస్తున్నాను. అందుకు కావల్సిన మనోబలం ప్రసాదించమని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను."

పరాత్పరరావు ప్రతిజ్ఞకు సభ పులకించిపోయింది. స్టేజీని అలంకరించిన పెద్దలతోబాటు సభాసదుల కరతాళధ్వనులతో దిక్కులు పిక్కటిల్లిపోయాయి. అందరి కన్నులూ చెమ్మగిల్లిన వేళ అధ్యక్షులవారు అన్నారు.

"పరాత్పరరావుకు పరోపకారబుద్ధి కలిగించిన ఆ విద్యార్థిని ఉత్సవ నిర్వాహక కమిటీ తరపున నేను సన్మానించాలనుకుంటున్నాను. దయచేసి ఆ విద్యార్థి ఎక్కడదున్నా వేదిక మీదికి రావల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. పరాత్పరరావు పదికాలాలపాటు పేదవిద్యార్థులకు అండగా నిలబడడానికి ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తూ ఆ విద్యార్థిని యీ సన్మానం అందుకోమని కోరుతున్నాను.'

సభ్యులలో కలకలం మొదలైంది.

పేద విద్యార్థి సమూహం బలవంతంగా ముందుకు నెట్టిన ఓ విద్యార్థి వేదిక వైపు వినయం మూర్తీభవించిన విద్యాతురుడిలా అడుగులేస్తున్నాడు. ఆ వెనుక రిథమిక్‌గా చప్పట్లుకొట్టే ఆ విద్యార్థి బృందం చక్కని నేపథ్య సంగీతం అందిస్తున్నట్లుంది. ■

